
తారు పూసి.. నిధులు దోచి!

ఎనిమిది వందల మీటర్ల బీటీ రోడ్డు..

రూ.34.5 లక్షలు మంజూరు.. ఈనెల 11న పనులకు ఎమ్మెల్యే భూమి పూజ.. పట్టుమని పదిహేను రోజులు కూడా కాకముందే కాంట్రాక్టర్ పనులు కూడా పూర్తి చేశాడు. అంతవరకు బాగానే ఉన్నా.. రోడ్డు మాత్రం మూడు రోజులకే బీటలు వారింది. అంచుల వెంట చేతితో పట్టుకుంటే ఊడి వస్తుంది. నాణ్యతకు తిలోదకాలిచ్చి మట్టేసి మమ అనిపించి ఆపై తారు పూసి నిధులు దోచిన కాంట్రాక్టర్‌పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పత్తా లేకుండా పోవడంతో ప్రజల్లో పలుచనవుతున్నారు.

- బీటీ రహదారి నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిచ్చిన కాంట్రాక్టర్
- మూడు రోజులకే బీటలువారిన తారు రోడ్డు
- అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు


రోడ్డు తారు పెచ్చులను పీకుతున్న ప్రజలు,


మూన్నాళ్లకే పగుళ్లిచ్చిన బీటీ రహదారి

3 రోజులకే పగుళ్లు


రహదారి నిర్మాణం పూర్తైన 3 రోజులకే పగుళ్లు ఇచ్చింది. నిత్యం వందల సంఖ్యలో వ్యవసాయ పనులకు, రాకపోకలకు వెళ్లే వాహనాలు, పంట కోతల సమయంలో భారీ యంత్రాలు, పంట దిగుబడులు తరలించేందుకు భారీ లారీలు తిరిగే ఈ రహదారిలో మూన్నాళ్లకే పగుళ్లిస్తే ఎంత కాలం ఉంటుందనే అనుమానాలు వ్యక్తంఅవుతున్నాయి. ఎంత నాణ్యతతో రోడ్డు వేశారని ప్రజల నుంచి వ్యంగ్యాస్త్రాలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా చేతి వ్రేళ్లతో పెకిలిస్తే తారు పెచ్చులు ఊడి వస్తుండటం చూస్తే నాణ్యత ప్రమాణాలు ఏ మేరకు పాటించారో అర్థమౌతుంది.

పాములపాడు: మండల పరిధిలోని క్రిష్టారావుపేట గ్రామం నుంచి తుమ్మలూరు గ్రామం వరకు 800 మీటర్లు నాబార్డు నిధులు రూ.34.5 లక్షలతో బీటీ రహదారి మంజూరైంది. ఈ పనులకు సంబంధించి ఈనెల 11న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య భూమి పూజ చేశారు. కాంట్రాక్టర్ అనుకున్నదే తడువుగా పనులు ప్రారంభించారు. వేగంగా పనులు జరుగుతుండటం చూసి ప్రజలు సంబరపడ్డారు. కానీ మూడు రోజులకే తారు రోడ్డు బీటలు వారడం చూసి అవాక్కవుతున్నారు.

ఇళ్ల ముందు మట్టి తవ్వి..

రహదారికిరువైపులా ఉన్న ఇంళ్ల ముందు మట్టిని జేసీబీతో తవ్వి బీటీ రోడ్డు ఎడ్జ్‌కు వేశారు. ఇదేంటని అడిగిన ప్రజలకు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ పనులు ముగించుకున్నాడు. పనులను అధికారులు పర్యవేక్షించ లేదో లేక ముడుపులు తీసుకుని చూసీచూడనట్లు వదిలేశారో కానీ ఏమాత్రం నాణ్యత లేకపోవడంతో రోడ్డు ప్రజల కోసమా, కాంట్రాక్టర్ జేబు నింపడానికా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రహదారిపై గుంతలు పూడ్చేందుకు గ్రామ పంచాయతీ వారు తరలించిన మట్టి, రాళ్లను కూడా కాంట్రాక్టర్ యథేచ్ఛగా వాడుకున్నట్లు సమాచారం.

అసంపూర్తిగా కల్వర్టు..


నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టిన కల్వర్టు

బీటీ రహదారి నిర్మాణంలో భాగంగా కల్వర్టు ఏర్పాటు చేశారు. కల్వర్టులో పంట పొలాలకు సాగు నీరు, గ్రామాల్లోని వృథా నీరు ప్రవహించాల్సి ఉంది. గతంలో ఉన్న పాత కల్వర్టును పగలగొట్టి నూతన కల్వర్టు పనులకు శ్రీకారం చుట్టారు. నిర్మాణానికి ముందు సిమెంటు బెడ్డు వేసి ఆపై పొంగలు(సిమెంటు పైపులు) వేసి, తర్వాత స్లాబు వేయాలి. కానీ ఇవేమి చేయకుండా జేసీబీతో గుంత తవ్వి సిమెంటు పైపులు వేసి పైన మట్టి వేసి వెళ్లిపోయారు. ఈ కల్వర్టుపై ఎన్ని రోజులు రాకపోకలు సాగుతాయో ప్రశ్నార్థకంగా మారింది. ఉన్నతాధికారులైనా స్పందించి రహదారిని, కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదెక్కడి బీటీ రోడ్డు?


ఇదెక్కడి బీటీ రోడ్డు? చదునుగా లేదు. అప్పుడే కంకర తేలింది. ఎట్లా పడితే అట్లా వేశారు. ఇదేనా ప్రభుత్వం చేపట్టిన రహదారుల అభివృద్ధి?. ఇలాంటి రోడ్డు వేశామనిచెప్పుకునేందుకే కానీ ప్రజలకు ఉపయోగం లేదు. రోడ్డు నాణ్యతపై జిల్లా కలెక్టరును కలిసి ఫిర్యాదు చేస్తాం.

– రాజేష్, క్రిష్టారావుపేట

మా ఇంటి ముందు గుంత తవ్వారు


మా ఇంటి ముందు మట్టిని తవ్వి రోడ్డుకు వేయడంతో గుంత పడింది. మళ్లీ పూడ్చలేదు. మేము మళ్లీ మట్టి తెచ్చుకొని వేసుకోవాలా?. ఈ మాత్రం దానికి కొత్త రోడ్డు ఎందుకు వేయాలి?. అడిగేవారు లేరని కాంట్రాక్టర్ ఇష్టమొచ్చినట్లు రోడ్డు వేశాడు.

– అబ్రహున్నిసా, తుమ్మలూరు

ఎవరికైనా చెప్పుకోండన్నాడు


గ్రామంలో తారు రోడ్డు నాణ్యతగా వేయ లేదు. ఇదే విషయాన్ని కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే.. "మేము వేసేది ఇంతే. మీ ఇష్టం వచ్చిన వాళ్లకు చెప్పుకోండి" అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడు. – శేఖర్, తుమ్మలూరు

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం

రహదారి పనులు నాణ్యతతో నిర్మాణం చేపట్టలేదని ప్రజల నుంచి ఫిర్యాదు అందింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించిన తరువాతే బిల్లు చెల్లించేది. కల్వర్టు నిర్మాణం పూర్తి చేయకుండా వెళ్లారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం. – వాహిద్, ఏఈ

క్లుప్తంగా

మహానందిలో ఆర్‌అండ్‌బీ సీఈ పూజలు


మహానందికి వచ్చిన సీఈ, ఈఈలు

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో బుధవారం ఆర్‌అండ్‌బీ సీఈ వెంకటేశ్వరరావు, ఈఈలు శ్రీధర్ రెడ్డి, కృష్ణారెడ్డి పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అలంకార మండపంలో వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనాలు చేసి స్వామి వారి ప్రసాదాలు అందించారు.

సాక్షి గణపతికి విశేష పూజలు


శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

అలరించిన నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన రాగరమ్య కల్చరర్ అర్గనైజేషన్ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విఘ్నంరాజం భజే, శివపాద మంజీరనాదం, శివతాండవం, భో శంభో, జతిస్వరం తదితర గీతాలకు, అష్టకాలకు ప్రియదర్శిని, సృజన, సహస్ర, నక్షత్ర, కల్యాణి, ఆరాధ్య తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు

నందికొట్కూరు: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ఇల్లు లేని వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇస్తామని చెప్పి ఏడాదైనా ఇవ్వకపోవడం తగదన్నారు. వెంటనే ఇంటి స్థలాలు ఇచ్చి నిర్మాణాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు స్వామన్న, సుధాకర్, సోమన్న, బీబీ, లక్ష్మీదేవి, ముర్తుజాబి, చెంచమ్మ, నాగమణి, శివ కుమార్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు విరాళం


ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

వెలుగోడు: నంద్యాల చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో ఎం.పరమేశ్వరప్ప జ్ఞాపకార్థం స్థానిక వృద్ధాశ్రమానికి డాక్టర్ రాజప్ప కుటుంబ సభ్యులు రెండు ఫ్యాన్లు విరాళమిచ్చారు. బుధవారం సంస్థ అధ్యక్షుడు వాసగిరి విజయ భాస్కర్‌కు రాజప్ప కుటుంబ సభ్యులు ఫ్యాను అందజేశారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకులు గుజరాతి వరలక్ష్మి, భాష్యం శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

చేపల పెంపకంపై అవగాహన


మాట్లాడుతున్న డీడీఎం కార్తీక్

వెలుగోడు: పట్టణంలోని మత్స్యకార రైతులకు బుధవారం చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం కార్తీక్, నవ యూత్ అసోసియేషన్ సీఈఓ నరసింహులు, బోర్డ్ మెంబర్లు రైతులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో అసంతృప్తి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ రెడ్డి, తదితరులు

వెలుగోడు: కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వెన్నుపోటు పుస్తకాన్ని బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అరాచకాలు, మహిళలు, యువతులు, చిన్నారులపై అకృత్యాలు పెరిగాయన్నారు. హామీలను నెరవేర్చకుండా ప్రశ్నించేవారిని కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తూ కాలం గడుపుతున్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దేశం తిరుపంరెడ్డి, ఇలియాస్ ఖాన్, జైపాల్, నాగేశ్వరరెడ్డి, బోగోలు సుదర్శనం, షంషీర్ అలీ, యేసురత్నం, గోవిందు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి


వేంపెంట సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: తల్లికి వందనం పథకానికి అర్హులైన తల్లులతో ఈకేవైసీ చేయించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని వేంపెంట, బానకచెర్ల సచివాలయాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఖాజా ఉన్నారు.

పథకాలు అమలు చేయాలి


ర్యాలీగా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న, సీపీఐ ఆత్మకూరు మండల కార్యదర్శి టి.ప్రతాప్ డిమాండ్ చేశారు.బుధవారం పార్టీ కార్యాలయం నుంచి గౌడ్‌సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కేజీ రోడ్డు హమాలీ యూనియన్ నాయకుడు చాంద్‌బాషా చేతులమీదుగా జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు లల్లు, హతావుల్లా, జిల్లా మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు మృతుజాబీ పాల్గొన్నారు.

లీకేజీ నీటితో రాకపోకలకు ఇబ్బంది

- అండర్‌పాస్ వంతెన కింద కుంటను తలపిస్తున్న వైనం


వంతెన కింద నీళ్లు నిలవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

పాములపాడు: మండల కేంద్రం నుంచి చెలిమిల్లకు వెళ్లే రహదారిలోని అండర్‌పాస్ వంతెన కింద నీళ్లు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇటీవల కురిసిన వర్షం నీరు సైడ్ దిమ్మెలపై నిలిచిన నీరు లీకవడంతో కుంటను తలపిస్తోంది. అండర్‌పాస్ వంతెన నిర్మానం మొదటి నుంచే వివాదాస్పదంగా మారింది. ఎత్తు తక్కువగా ఉందని ప్రజా సంఘాలు, చెలిమిల్ల, లింగాల గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నా అధికారులు పెడచెవిన పెట్టారు. ఎత్తు తక్కువగా ఉందని చెప్పడంతో వంతెన కింద మట్టిని తీసి వంతెన ఎత్తు ఎక్కువ ఉందని చూపించే ప్రయత్నం చేశారు. అది కాస్త కుంటలా మారి నీరు నిలిచింది. అటుగా ప్రయాణాలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులెదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు పునఃపరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వ్యక్తికి తీవ్రగాయాలు


తీవ్రగాయాలపాలైన వడ్డె రమణ

జూపాడుబంగ్లా: విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ తో వడ్డెరమణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం సాయంత్రం 7గంటలకు చోటుచేసుకొంది. గ్రామంలోని జగనన్నకాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను చెక్ చేసేందుకు వడ్డెరమణ విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ కావటంతో తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు 108లో చికిత్సనిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఊరించి.. ఉసూరుమనిపిస్తున్న మేఘాలు



జూపాడుబంగ్లా: ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశంలో మేఘాలు కమ్ముకొని ఉండటంతో పాటు అప్పుడో ఇప్పుడో వర్షం కురిసేలా ఊరించి ఉసూరుమనిపించాయి. మండ్లెం, తర్తూరు, తంగడంచ, పారుమంచాల, పి.లింగాపురం, తూడిచెర్ల, తాటిపాడు, భాస్కరాపురం తదితర గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌కు గాను సుమారు వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, మిరప, తదితర పంటలను సాగుచేశారు. బోర్లు, బావులున్న రైతులు పంటలకు నీటిని పారించుకుంటుండగా వర్షాధారం కింద సాగుచేసిన పంటలకు సాగునీరు లేకపోవటంతో వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. మరో వారం రోజుల్లోగా వర్షం కురవకపోతే పైర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపల్లి మండలంలో మోస్తరు వర్షం

కొత్తపల్లి: మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఎం.లింగాపురం, బావాపురం, వీరాపురం, బండినాయినిపాలెం, గువ్వలకుంట్ల గ్రామాలతోపాటు కొత్తపల్లిలో మోస్తరు వర్షం కురిసింది. చిన్నపాటి వర్షానికే కొత్తపల్లి నుంచి గువ్వలకుంట్లకు వెళ్లే రహదారిలో నీళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారికి ఇరువైపులా కాల్వలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

యోగా దినోత్సవానికి ఏర్పాట్లు

ఆత్మకూరు: ఈనెల 21న జాతీయ యోగా దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీఓ నాగజ్యోతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ యోగా దినోత్సవంలో పాల్గొనాలని ఇప్పటికే శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేలను ఆహ్వానించామన్నారు. జిల్లావ్యాప్తంగా 3 లక్షల మంది ప్రజలను యోగా దినోత్సవంలో భాగస్వాములను చేయనున్నామన్నారు.

మోదీతోనే దేశ అభివృద్ధి

పాములపాడు: దేశ ప్రధాని నరేంద్రమోదీ పాలన అభివృద్ధి యుగానికి నాంది అని బీజేపీ మండల అధ్యక్షుడు మురళీమోహన్ అన్నారు. ప్రధానిగా మోదీ 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. జనరంజకమైన పాలనతో ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అనేక కొత్త పథకాలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. పథకాల గురించి ప్రజలకు వివరించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు: ఈనెల 26న నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి సూచించారు. బుధవారం మండంలోని అల్లూరు గ్రామంలో జాబ్ మేళాకు చెందిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 10 ప్రైవేటు కంపెనీలకు చెందిన ప్రతినిధులతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన వారు అర్హులని, మరిన్ని వివరాలకు 9154830286, 7673902328 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

జూపాడుబంగ్లా: అప్పు తీర్చలేదనే సాకుతో రజక మహిళను కట్టేసి హింసించిన వారిని కఠినంగా శిక్షించాలని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ రజకులపై దాడులు పునరావృతం కాకుండా సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యోగాంధ్రలో పాల్గొనాలి

ఆత్మకూరు: ఈనెల 21వ పట్టణంలోని పాత బస్టాండు వద్దనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్న యోగా దినోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు.

బేబి ఫీడింగ్ సెంటర్‌పై అవగాహన కల్పించండి

- ఈఓ ఎం.శ్రీనివాసరావు


అధికారులతో మాట్లాడుతున్న ఈఓ ఎం.శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన బేబి ఫీడింగ్ సెంటర్‌పై భక్తులకు అవగాహన కల్పించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. బుధవారం దేవస్థాన పరిపాలన భవనంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలన్నారు. క్యూలైన్ వద్ద నడవలేని వారు, దివ్యాంగుల సౌకర్యార్థం విరామాల కేంద్రం వద్ద మరిన్ని చక్రాల కుర్చీలను ఏర్పాటు చేయాలన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా చక్రాల కుర్చీలను రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. క్యూ కాంప్లెక్స్‌లో వేచిఉన్న భక్తులకు నిరంతరం అల్పాహారం, తాగునీటిని అందించాలన్నారు. అన్నప్రసాదాలలో వంటకాలన్నీ రుచికరంగా ఉండాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రతి హాలును ప్రత్యేకంగా సిబ్బంది ఒకరు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. సమావేశంలో దేవస్థాన ఏఈఓలు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వన్య ప్రాణులకు హాని కలిగిస్తే కఠిన శిక్షలు


మాట్లాడుతున్న దూపాడు శ్రీధర్

మహానంది: వన్యప్రాణులకు హాని కలిగిస్తే కఠిన శిక్షలు ఉంటాయని హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హైటికాస్) ప్రతినిధి దూపాడు శ్రీధర్, వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో టీమ్ లీడర్ రాజశేఖర్ తెలిపారు. మహానంది సచివాలయం వద్ద వన్యప్రాణి చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు వన్యప్రాణులను సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో పచ్చర్ల వద్ద జిల్లా స్థాయిలో ఉన్న సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు

- ఈఓ ఎం.శ్రీనివాసరావు

సాక్షి ఎఫెక్ట్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం సమీపంలోని ఇష్టకామేశ్వరి ఆలయానికి తరలివెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మార్కాపురం అటవీ సంరక్షణాధికారికి శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు సూచించారు. ఈనెల 17న "సాక్షి"లో "ఇష్టదైవం..కష్ట దర్శనం!" శీర్షికన ప్రచురించిన కథనానికి ఈఓ స్పందించారు. ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయ సందర్శన టికెట్లను ఆన్‌లైన్‌లో ప్రస్తుతం ఉన్న 16 టికెట్లకు గానూ 50 టికెట్లకు పెంచాలని, భక్తులకు ఇబ్బందులు లేకుండా శిఖరేశ్వరం వద్ద గాకుండా శ్రీశైలంలోని అటవీశాఖ కార్యాలయం వద్ద టికెట్ల కౌంటర్ ఏర్పాటు చేయాలని, కరెంట్ బుకింగ్ టికెట్లు కూడా పెంచాలని మార్కాపురం అటవీ సంరక్షణాధికారికి లేఖ రాశారు.

చెంచులకు అవగాహన సదస్సు


చెంచులకు ఆయుష్మాన్‌భవ కార్డులను అందజేస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ చెంచుగూడెంలో ధర్తి ఆబ భగీ దరి అభియాన్ కార్యక్రమంపై బుధవారం చెంచులకు ఐటీడీఏ శ్రీశైలం ప్రాజెక్ట్ అధికారులు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు, తాగునీటి కుళాయి, విద్యుత్, రహదారుల ఏర్పాటుతోపాటు ఆయుష్మాన్‌భవ కార్డులు, రేషన్ కార్డులు, క్యాష్ట సరిఫికెట్లు, ఆధార్‌కార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, డిప్యూటీ తమసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.


కృష్ణానదిలో పరవళ్లు తొక్కుతున్న వరద ప్రవాహం


నువ్వుల పంటను ఎగువ ప్రాంతానికి తరలించి నూర్పిళ్లు చేస్తున్న రైతులు

కృష్ణానదికి పెరుగుతున్న వరద

- ఆందోళనలో నీటి మునక లోతట్టు ప్రాంత రైతులు
- ఎగువ ప్రాంతానికి తరలిస్తున్న నువ్వుల పంట

పగిడ్యాల: కృష్ణానదికి వరద ప్రవాహం పెరుగుతుండటంతో లోతట్టు ప్రాంత రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నది వెంట నీటి మునక పొలాల్లో రబీలో రైతులు సాగు చేసుకున్న నువ్వుల పంట ముంపునకు గురవుతోంది. నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, పగిడ్యాల, బీరవోలు, సంకిరేణిపల్లె, ఎం,ఎస్.ఘణపురం, తూర్పు, పడమర ప్రాతకోట తదితర గ్రామాల ప్రజలు మునక భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా ఒక్క కారు పంటను సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. బ్యాక్‌వాటర్ తగ్గుముఖం పట్టగానే రైతులు విత్తనాలు వేసుకున్నారు. కృష్ణానదికి వరద నీరు పెరగడం గమనించిన రైతులు నువ్వుల కట్టే కుప్పలను ఎగువ ప్రాంతాలకు తరలించి నూర్పిళ్లు చేసుకుని ఆరబెట్టుకున్నారు. ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల మేరకు దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వరద నీటిలో ముంపునకు గురవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.